ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.


ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 303 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 9 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# ఢిల్లీ పీఠంపై కమలదళం




ఇక డబుల్ ఇంజిన్ సర్కార్‌కు రంగం సిద్ధం
ఆప్‌ను ఊడ్చి పారేసిన రాజధాని ఢిల్లీ ప్రజలు
జైలుకెళ్లిన ఆప్ నేతలంతా ఓటమి
పర్వేశ్ సింగ్ వర్మ చేతిలో కేజ్రీవాల్ పరాజయం
చివరి రౌండులో బయటపడ్డ సీఎం అతిషి
ఖాతా కూడా తెరవని కాంగ్రెస్ పార్టీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ప్రభాత ఉదయం):** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఘోర పరాజయం పాలైంది. రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ విరామం తరవాత బిజెపి అక్కడ అధికారం చేపట్టబోతోంది. అవినతిని ఏడ్చేస్తానంటూ గద్దెనెక్కిన ఆప్‌ను ప్రజలు ఊడ్చి అవతల పడేశారు. ఈ నెల 5న జరిగిన ఎన్నికలకు సంబంధించి శనివారం ఓట్ల లెక్కింపు జరిగింది. 70 సీట్లకు గాను బిజెపి మ్యాజిక్ ఫిగర్‌ను దాటి 47 సీట్లలో ఆధిక్యం ప్రదర్శించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలే కౌంటింగ్‌లో కనిపించాయి. కాంగ్రెస్ ఎక్కడా ఖాతా తెరవలేదు. పోటీ బిజెపి, ఆప్ మద్యే జరిగినట్లు ఫలితాలు వెల్లడించాయి. మొత్తంగా డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడబోతోంది. ఫలితాలపై బిజెపి హర్షం వ్యక్తం చేయగా, ప్రజల తీర్పును స్వాగతిస్తున్నట్లు అరవింద్ కేజ్రీవాల్ప్రకటించారు. ఇకపోతే ఫలితాల తీరును గమనిస్తే.. ముఖ్యంగా ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఎఫెక్ట్ ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. ఆప్ కీలక నేతలంతా ఒక్కొక్కరుగా ఓటమి పాలయ్యారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సహా మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్, సోమనాథ్ భారతి వంటి కీలక నేతలు ఓడిపోయారు. లిక్కర్ స్కామ్‌లో జైలుకెళ్లిని కేజ్రీవాల్, సిసోడియా, సత్యేందర్ జైన్ ఓడిపోవడం గమనార్హం. సాధారణంగా జైలుకు వెళ్లి వచ్చిన ఏ నాయకుడికైనా సానుభూతి వస్తుంది, అయితే ఢిల్లీ ఓటర్లు మాత్రం లిక్కర్ స్కామ్‌లో వీరి హస్తం ఉందని భావించినట్లు ఉన్నారు. అందుకే ముగ్గురిని కూడా చావుదెబ్బ తీశారు. తనను కావాలనే బీజేపీ టార్గెట్ చేస్తోందని కేజ్రీవాల్ పదేపదే ఆరోపించినప్పటికీ ఢిల్లీ ఓటర్లు నమ్మలేదు. లిక్కర్ స్కామ్‌కి తోడు శీష్ మహల్, ప్రభుత్వ వ్యతిరేకత, మధ్య తరగతి వర్గాలు బీజేపీ వైపు వెళ్లడం ఇవన్నీ ఆప్ ఓటమికి కారణమని చెప్పవచ్చు. ఢిల్లీ లిక్కర్ ..మిగతా 2లో





## ఆప్ నుంచి ఢిల్లీ ప్రజలకు విముక్తి

ఇది ఢిల్లీ ప్రజలకు ముమ్మాటికీ పండగ రోజే
ఢిల్లీ ప్రజలను ప్రేమను అభివృద్ధిలో చూపిస్తాం
ఢిల్లీ ప్రజల భవిష్యత్తు మోదీ గ్యారంటీ
జీరోతో పోటీపడ్డ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ
బీజేపీ కార్యాయలంలో విజయోత్సవ సభలో మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ప్రభాత ఉదయం):** ఆప్ నుంచి..కేజీవ్రాల్ నుంచి ఢిల్లీ ప్రజలకు విముక్తి లభించిందని ప్రధాని మోదీ అన్నారు. ఇది ఢిల్లీ ప్రజలకు పండగ రోజని అన్నారు. ఇంతటి విజయం అందించిన ఢిల్లీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీ ప్రజలను ప్రేమను అభివృద్దిలో చూపిస్తామన్నారు. ఢిల్లీలో బీజేపీ విజయం సామాన్యమైనది కాదు.. ఢిల్లీ వికాస్ , విజన్ కోసం ముందుకెళ్తామన్నారు. ఢిల్లీ ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కార్ ను తెచ్చుకున్నారు. ఢిల్లీ ప్రజల సేవకోసమే బీజేపీ ఉన్నదని అన్నారు. ఢిల్లీ ప్రజల భవిష్యత్తు మోదీ గ్యారంటీ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ ఢంకా మోగించిన విషయం తెలిసిందే. మొత్తం70కి పైగా అసెంబ్లీ స్థానాలకు బీజేపీ48 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. మ్యాజిక్ ఫిగర్‌ను దాటి 27 ఏళ్ల తర్వాత అధికారం చేపట్ట బోతుంది. బిజెపి కార్యాలయంలో జరిగిన విజయోత్సాహ సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. ఈ ..మిగతా 2లో

త్వరలోనే పట్టాలకెక్కనున్న
## వందేభారత్ స్వీపర్ రైళ్లు



కసరత్తు చేస్తున్న భారతీయ రైల్వే శాఖ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ప్రభాత ఉదయం):** భారతీయ రైల్వే ప్రతిష్టాత్మకంగా వందే భారత్ రైళ్లను ప్రవేశపెడు తున్నది. ఇప్పటికే పలుమార్గాల్లో సెమీహైస్పీడ్ రైళ్లు పరుగులుపెడుతున్నాయి. త్వరలోనే ..మిగతా 2లో

## ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం



బీజేపీకి అభినందనలు తెలిపిన కేజ్రీవాల్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (ప్రభాత ఉదయం):** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బిజెపికే పట్టం కట్టారు. 47 సీట్లలో బిజెపి ముందంజలో ఉంది. దీంతో బిజెపికి గెలుపు ఖరారు కానుందనే సంకేతం కనిపిస్తోంది. మరోవైపు ఆప్ 23 సీట్లలో ఆధిక్యంలో ఉంది. ఈ నేపథ్యంలో ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ప్రజా తీర్పును అంగీకరిస్తున్నామని అన్నారు. అధికారంలోకి రానున్న బిజెపికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ పార్టీకి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన వీడియో ..మిగతా 2లో

స్థానిక ఎన్నికలకు స్పీడ్ పెంచిన
## ఎన్నికల సంఘం

జిల్లాకు పది మంది చొప్పున మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్, స్టేట్ రిసోర్స్ పర్సన్‌ల ఎంపిక




**హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ప్రభాత ఉదయం):** స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే క్రమంలో ఎన్నికల సంఘం స్పీడ్‌ను పెంచింది. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాకు పది మంది చొప్పున మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్, స్టేట్ రిసోర్స్ పర్సన్‌లను ఎంపిక చేసింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం శిక్షణ ఇవ్వనుంది. ఇప్పటికే మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్, స్టేట్ రిసోర్స్ పర్సన్‌లకు ఎంసీహెచ్‌ఆర్డీలో ఎన్నికల సంఘం ట్రైనింగ్ ఇచ్చింది. జిల్లా కలెక్టర్లకు తెలంగాణ ఎలక్షన్ కమిషన్, కీలక ఆదేశాలు జారీ చేసింది. మండల, జిల్లా పరిషత్, పంచాయతీ రిటర్నింగ్ అధికారులను ఫిబ్రవరి 10వ తేదీ లోపు ఎంపిక పూర్తి చేయాలని ఆదేశించింది. పంచాయితీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల కోసం ఎంపిక చేసిన రిటర్నింగ్ అధికారులకు ఫిబ్రవరి 12లోపు శిక్షణ పూర్తి కావాలని తెలిపింది. పోలింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు ఈ నెల 15లోపు శిక్షణ పూర్తి చేయాలని సూచించింది. పోలింగ్ సిబ్బందికి మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్‌తో శిక్షణ పూర్తి చేయాలని తెలంగాణ ఎలక్షన్ కమిషన్ ఆదేశించింది.

## కాగజ్‌నగర్‌ను మహారాష్ట్రలో కలపాలా?

బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు దారుణం
క్షేత్రస్థాయిలో స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి
ఆర్ఎస్ ప్రవీణ్ కష్టకాలంలో మనతో కలిశారు
తెలంగాణ భవన్‌లో కాగజ్‌నగర్ కార్యకర్తల భేటీలో కేటీఆర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ప్రభాత ఉదయం):** సిర్పూర్ కాగజ్ నగర్‌ను మహారాష్ట్రలో కలపమని అక్కడి బీజేపీ ఎమ్మెల్యే సోయిలేకుండా మాట్లాడు తున్నాడని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాగజ్ నగర్ బీఆర్ఎస్ పార్టీ నాయ కులు, కార్యకర్తల మనసులో ఉన్న మాట తనకు అర్థమైందని.. ఇదే విషయాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. క్షేత్రస్థాయి లో కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకతను ఉపయోగిం చుకొని వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్న మనపార్టీతో కలిసి నడిచేందుకు ముందుకు వచ్చిన నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అని కేటీఆర్ అన్నారు. తెలంగాణ సమాజం గురించి.. తెలంగా ణ అభివృద్ధి గురించి భవిష్యత్తు తెలంగాణ గురించి ప్రవీణ్ కుమార్ ఆలోచనలు నా ఆలోచనలు దా దాపు ఒకే రకంగా ఉన్నాయని తెలిపారు. సిర్పూర్ కాగజ్ నగర్‌తో తనకు వ్యక్తిగతంగా అనుబంధం ఉన్నదని కేటీఆర్ తెలిపారు. 2006 నుంచి 2009 వరకు అక్కడ ..మిగతా 2లో




స్థానిక సంస్థల ఎన్నికల్లో
## బీఆర్ఎస్ ఫోకస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ప్రభాత ఉదయం):** స్థానిక సంస్థల ఎన్నికలపై బీఆర్ఎస్ ఫోకస్ పెట్టింది. లోకల్ బాడీ ఎన్నికలకు కేడర్‌ను గులాబీ పార్టీ సిద్ధం చేస్తోంది. శనివారం ఉదయం 11గంటలకు తెలంగాణ భవన్‌లో వికారాబాద్ జిల్లా నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సమా వేశం అయ్యారు. ఈ సందర్భం గా స్థానిక సంస్థల ఎన్నికలపై కేడర్‌కు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని గులాబీ పార్టీ పట్టుదలతో ఉంది. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా బీఆర్ఎస్ ఉంది. ఈ నేపథ్యంలో గ్రామాలను ప్రభావితం చేసే స్థానిక సంస్థల ఎన్నికలపై కారు పార్టీ దృష్టి సారించింది. మాజీమంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బీసీ నేతల సమావేశం ఆదివారం జరగనుంది. ఆదివారం ఉదయం 11గంటలకు తెలంగాణ భవన్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నారు. బీసీల కులగణనతోపాటు ప్రస్తుత రాజకీయాలపై బీఆర్ఎస్ తరఫున కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉంది.



# ఆప్ నుంచి ఢిల్లీ ప్రజలకు విముక్తి

**మొదటి పేజీ తరువాయి...**

సందర్భంగా బిజెపి నేతలు అమిత్ షా, నడ్డాలు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే ఢిల్లీ నేతలు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ ..ఆప్ అరాచకాలు.. ఆడంబరాలకు ఇది అంతం అన్నారు.. మూడో సారి లోక్ సభ ఎన్నికల్లో విజయం సాధించాం. మోదీ గ్యారంటీలను ఢిల్లీ ప్రజలు నమ్మారు.. షార్ట్ కట్ రాజకీయాలకు షాకిచ్చి ఢిల్లీ ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కార్ ను తెచ్చుకున్నారని ప్రధాని మోదీ అన్నారు. దిల్లీలో విజయం సామాన్య విజయం కాదు. వికసిత్ రాజధానిగా మార్చే అవకాశం మాకు ఇచ్చారు. దిల్లీని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటాం. మా పార్టీపై నమ్మకం ఉంచిన దిల్లీ ప్రజలకు కృతజ్ఞతలు. దిల్లీ ప్రజలు చూపించిన ప్రేమను అనేక రెట్లు పెంచి తిరిగిస్తాం. పదేళ్ల కష్టాలు, సమస్యల నుంచి దిల్లీకి విముక్తి లభించింది. పదేళ్లపాటు దిల్లీని అహంకారంతో పరిపాలించారని అన్నారు. ఇక నుంచి దిల్లీలో వికాస్, విజన్, విశ్వాస్ నినాదాలతో పరిపాలన. దిల్లీ విజయానికి కష్టపడిన కార్యకర్తలకు అభినందనలు. నిజమైన విజేతలు దిల్లీ ప్రజలే. అడ్డదారుల్లో వచ్చిన వారికి ప్రజలు షాక్ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా 3 సార్లు మొత్తం సీట్లు మాకే ఇచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కారుపై ఇక్కడి ప్రజలు నమ్మకం ఉంచారు. హరియాణా, మహారాష్ట్రలో కూడా గొప్ప విజయం సాధించాం అన్నారు. దిల్లీ మామూలు నగరం కాదు.. మినీ భారత్. దిల్లీలో గెలిచామంటే దేశమంతా భాజపాను దీవించినట్లే. దిల్లీ అభివృద్ధికి నాది గ్యారెంటీ. మెట్రో పనులు ముందుకెళ్లకుండా ఆప్ నేతలు అడ్డుకున్నారు. ఆయుష్మాన్ భారత్ లాభం దిల్లీ ప్రజలకు దక్కకుండా చేశారు. దిల్లీలో అభివృద్ధికి ఎవరు అడ్డ పడుతున్నారో ప్రజలు గ్రహించారు. అన్నీ ఆలోచించే ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కారును కోరుకున్నారు. దిల్లీ అభివృద్ధి కోసం పగలు, రాత్రి పనిచేస్తాం. పూర్వాంచల్ ప్రజల ప్రేమ, విశ్వాసం ఎప్పటికీ మరిచిపోలేం. ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో నిజమైన అభివృద్ధి చూడొచ్చు. మన పనితీరు చూసే అనేక రాష్ట్రాల్లో మళ్లీ మనకే అధికారం కట్టబెట్టారు. హరియాణాలో సుపరిపాలనకు నాంది పలికాం. మహారాష్ట్ర రైతులకు అన్ని విధాలా అండగా ఉన్నాం. ఏపీలో చంద్రబాబు తన ట్రాక్ రికార్డు నిరూపించుకున్నారు. సుపరిపాలన ఫలాలు పేదలు, మధ్యతరగతి ప్రజలకు దక్కాయి. దిల్లీ మెట్రోను మొట్టమొదట మేమే ప్రారంభించాం. అనేక నగరాల్లో విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నాం. దిల్లీని వాయుకాలుష్యం, పారిశుద్ధ్య సమస్యలు పీడిస్తున్నాయి. దిల్లీని సరికొత్త ఆధునిక నగరంగా మారుస్తాం' అని మోదీ హామీ ఇచ్చారు. ఇక కాంగ్రెస్ జీరోతో పోటీ పడిందని ఎద్దేవా చేశారు. రాహుల్ గతకొంతకాలంగా హిందూగా నటించే ప్రయత్నం చేసి భంగపడ్డారని అన్నారు. దిల్లీలో చరిత్రాత్మక విజయం సాధించాం. ఈ విజయం కోసం కార్యకర్తలు ఎంతో కృషి చేశారని, వారికి కృతజ్ఞతలని అధ్యక్షుడు జెపి నడ్డా అన్నారు. మోదీ నేతృత్వంలో పార్టీ వరుస విజయాలు సాధిస్తోంది. దిల్లీ ప్రజలు మా పార్టీపై విశ్వాసం ఉంచారు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లోనూ దిల్లీ ప్రజలు మా వెంట ఉన్నారు. 7 లోక్‌సభ సీట్లలోనూ మా పార్టీని గెలిపించారు. పేదలు, బలహీనవర్గాల జీవితాల్లో మార్పు తేవడమే మోదీ లక్ష్యం. దిల్లీలో సుపరిపాలన అందించేందుకు కట్టుబడి ఉన్నాం. దిల్లీ ప్రజలు సురక్షితమైన తాగునీరు, మంచి రహదారులు కోరుకుంటున్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ.. అబద్దాలు ఆడే పరిశ్రమ లాంటిదని ఎద్దేవా చేశారు.

## త్వరలోనే పట్టాలకెక్కనున్న వందేభారత్ స్లీపర్ రైళ్లు

**మొదటి పేజీ తరువాయి...**

వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కించేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తున్నది. సుదూర ప్రయాణాల్లో విప్లవాత్మక మార్పులను వందే భారత్ స్లీపర్ రైలు తీసుకువస్తుందని రైల్వేశాఖ పేర్కొంది. రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ తొలి వందే భారత్ స్లీపర్ ముంబయి- అహ్మదాబాద్ మార్గంలో 540 కిలోమీటర్ల దూరం ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించింది. 16 కోచ్‌లతో రైలు పరుగులు తీసింది. త్వరలోనే తొలి వందే భారత్ స్లీపర్ రైలును ప్రారంభించేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తున్నది. ట్రయల్ రన్‌కు సంబంధించిన డేటాను విశ్లేషించిన అనంతరం ఆర్‌డీఎస్‌ఓ ÷నైల్ ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నది. రైల్వే సేఫ్టీ కమిషనర్ రైలును గరిష్ఠ వేగాన్ని పరిశీలించనున్నారు. ఈ ఏడాది జనవరి తొలివారం రైలు కోటాలో 30-40 కిలోమీటర్ల స్వల్ప దూరంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సమయంలో రైలు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకుని వెళ్లింది. వందే భారత్ స్లీపర్ రైళ్లు రాబోయే కాలంలో రాత్రి ప్రయాణాన్ని పునర్నిర్వహించబోతున్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రోటోటైప్ విజయవంతమైన ట్రయల్ రన్ పూర్తి చేసిందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఏడాది మరో తొమ్మిది వందే భారత్ ట్రైన్ సెట్స్‌ను ఉత్పత్తి చేయాలని రైల్వేశాఖ భావిస్తుంది. ఏప్రిల్, డిసెంబర్ మధ్య ఐసీఎఫ్ డెలివరీ చేయనున్నది. ఈ రైలులో మూడు కేటగిరిలు అందుబాటులో ఉంటాయి. ఇందులో ఏపీ ఫస్ట్ క్లాస్, సెకండ్ క్లాస్ ఏసీ, ఏసీ త్రీ టైర్ అందుబాటులో ఉంటాయి. మొత్తం 1,128 బెర్తులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. గత నెలలో భారతీయ రైల్వేశాఖ 24 వందే భారత్ స్లీపర్ రైలు 50 రేకుల కోసం ఆర్డర్ వచ్చింది. రాబోయే రెండేళ్లలో సిద్ధమయ్యే అవకాశం ఉంది. 2026-27 సంవత్సరంలో 24 సెట్స్ ఉత్పత్తి కానున్నాయి. ఇది రైల్వే టెక్నాలజీలో భారత్ స్వావలంభనను మరింత బలోపేతం చేస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## శంషాబాద్‌లో నాలుగు విమానాల అత్యవసర ల్యాండింగ్



**హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ప్రభాత ఉదయం):** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో నాలుగు అంతర్జాతీయ విమానాలు ల్యాండింగ్ అయ్యాయి. వాతావరణం అనుకూలించక పోవడంతో వాటిని ఇక్కడే ల్యాండ్ చేశారు. చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో వాతావరణం అనుకూలించక పోవడం కారణంగా అక్కడికి వెళ్లే విమానాలను శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు దారి మళ్లించారు. ఈ క్రమంలో.. సింగపూర్- చెన్నై, చెన్నై-సింగపూర్, లండన్- చెన్నై, ముంబయి-చెన్నై విమానాలను శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో ల్యాండింగ్ చేశారు. ఉదయం 7 గంటల నుండి చెన్నైలో దట్టమైన పొగమంచు కురుస్తోంది. ఈ క్రమంలో చాలా విమానాలను ఇతర ఎయిర్ పోర్టుకు దారి మళ్లించారు అధికారులు. ఈ క్రమంలో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం చెన్నై విమానాశ్రయంలో ఖతార్ ఎయిర్‌వేస్ కార్గో విమానం ల్యాండింగ్ ప్రయత్నం విఫలం కావడంతో బెంగళూరు ఎయిర్ పోర్టుకు మళ్లించారు. మరోవైపు.. పొగమంచు కారణంగా దృశ్యమానత తక్కువగా ఉందని, రన్‌వేను చూడటం కష్టమవుతుందని చెన్నై విమానాశ్రయ అధికారులు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా విమానాలను దారి మళ్లించామని చెబుతున్నారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి అధికారులు విచారం వ్యక్తం చేశారు.

# ఢిల్లీ పీఠంపై కమలదళం

**మొదటి పేజీ తరువాయి...**




స్కామ్‌ని విచారిస్తున్న సీబీఐ, ఈడీలు ఈ కేసులో ఆప్ నేతల్ని అరెస్ట్ చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చిన కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేసి, అతిశీ మార్లెనాకు ఢిల్లీ పగ్గాలు అప్పగించి, అనధికార సీఎంగా పనిచేశారనే వాదనలు ఉన్నాయి. అయితే, తన నిజాయితీని ఢిల్లీ ప్రజలు నమ్ముతారని, మళ్లీ తననే అధికారంలోకి తీసుకువస్తారని కేజ్రీవాల్ భావించారు. తన నిజాయితీకి అసెంబ్లీ ఎన్నికలు రెఫరెండం అని, తనను కాపాడే బాధ్యత ఢిల్లీ ఓటర్లదే అని సెంటిమెంట్ కామెంట్స్ చేశారు. అయినా కూడా జైలుకు వెళ్లి వచ్చిన ముగ్గురు నేతలకు ఓటమి తప్పలేదు. ఇకపోతే కేజ్రీవాల్‌ను మాజీ సిఎం సాహిబ్‌సింగ్ వర్మ కుమారుడు బీజేపీ అభ్యర్థి పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ ఓడించి సంచలనం సృష్టించారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను నిజం చేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో దిల్లీ ఓటర్లు భాజపాకు పట్టం కట్టారు. ఘన విజయాన్ని అందించారు. కమలదళం హోరులో.. గత మూడు పర్యాయాలు అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కొట్టుకుపోయింది. శనివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా మ్యాజిక్ ఫిగర్ (36)ను దాటి 43 స్థానాల్లో విజయం సాధించింది. మరో 5 చోట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. అంటే 48 స్థానాల్లో కమలం హవా కనబర్చింది. వరుసగా నాలుగోసారి అధికారంలోకి రావాలనుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఆశలకు భాజపా గండికొట్టింది. అంతేకాదు.. ఆప్ అధినేత కేజ్రీవాల్ సహా పలువురు పార్టీ పెద్దలకూ ఓటమి తప్పలేదు. ఫలితాల్లో ఆప్ 19 చోట్ల విజయం సాధించింది. మరో 3 చోట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. మొత్తంగా 22 స్థానాలకు పరిమితమైంది. ఇక, కాంగ్రెస్ ఈ ఎన్నికల్లోనూ ఏ మాత్రం ప్రభావం చూపించలేక పోయింది. కనీసం ఒక్క స్థానంలోనూ ఆధిక్యం సాధించలేకపోయింది. దిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ న్యూదిల్లీ స్థానం నుంచి ఓటమి చవిచూశారు. భాజపా అభ్యర్థి పర్వేశ్ వర్మ చేతిలో 4,089 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. ఇదే స్థానంలో పోటీ చేసిన మాజీ సీఎం షీలా దీక్షిత్ తనయుడు సందీప్ దీక్షిత్‌కు 4,568 ఓట్లు రావడం గమనార్హం. దిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోదియా జంగ్‌పురాలో విజయం దక్కలేదు. తన సమీప భాజపా అభ్యర్థి తర్వీందర్ సింగ్ చేతిలో కేవలం 675 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ.. కాల్‌కాజీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఆది నుంచి వెనుకంజలో ఉన్న ఆమె చివరి రౌండ్లలో అనూహ్యంగా పుంజుకున్నారు. భాజపా అభ్యర్థి రమేశ్ బిధూరిపై 3,521 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఆప్ సీనియర్ నేత సత్యేంద్ర జైన్ షాకూరి బస్తీలో ఓటమిపాలయ్యారు. ఇక్కడ భాజపా అభ్యర్థి కర్నాల్ సింగ్ 20,998 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ గ్రేటర్ కైలాష్ స్థానంలో పరాజయం పాలయ్యారు. ఈ స్థానంలో భాజపా నాయకురాలు శిఖా రాయ్ 3,188 ఓట్ల తేడాతో నెగ్గారు. బిజ్వాసన్ నియోజకవర్గం నుంచి భాజపా నేత కైలాశ్ గెహ్లోత్ విజయం సాధించారు. తన సమీప ఆప్ అభ్యర్థి సురేందర్ భరద్వాజ్‌పై 9,833 ఓట్లతో గెలుపొందారు. భాజపా నేత అర్వీందర్ సింగ్ లవ్లీ గాంధీ నగర్‌లో విజయం సాధించారు. ఆప్ అభ్యర్థిపై 12,748 ఓట్ల మెజార్టీతో నెగ్గారు.

# కాగజ్‌నగర్‌ను మహారాష్ట్రలో కలపాలా?

**మొదటి పేజీ తరువాయి...**

పార్టీ బలోపేతం కోసం పని చేశానని గుర్తుచేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం జరిగిన సిర్పూర్ కాగజ్‌నగర్ బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం కోసం 400 కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చిన పార్టీ కార్యకర్తలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. అధికారం లేకున్నా.. అర్ధ రూపాయి డబ్బులు ఇవ్వకున్నా.. కేసీఆర్ మీద ప్రేమతో 400 కిలోమీటర్లు ప్రయాణించి హైదరాబాద్ వచ్చిన ప్రతి ఒక్క సోదర సోదరీమణునికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలుగుతామని అన్నారు. అందరికీ వెలుగునిచ్చే సూర్యుడు కూడా అప్పుడప్పుడు మబ్బుల చాటుకు వెళ్తాస్తాడని.. అలాగే కేసీఆర్ కూడా ప్రజల ఆశీర్వాదంతో తిరిగి అధికారంలోకి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. సిర్పూర్ కాగజ్ నగర్‌తో తనకు వ్యక్తిగతంగా అనుబంధం ఉన్నదని కేటీఆర్ తెలిపారు. 2006 నుంచి 2009 వరకు అక్కడ పార్టీ బలోపేతం కోసం పని చేశానని గుర్తుచేశారు. 2009లో శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పది సీట్లు మాత్రమే గెలిచినా సిర్పూర్ కాగజ్ నగర్ లో కూడా గులాబీ జెండా ఎగిరిందని అన్నారు. కాగజ్ నగర్ లో ఉన్న ప్రత్యేకమైన ప్రేమతో అక్కడ ఉన్న ఏకైక పరిశ్రమ కాగజ్‌నగర్ పేపర్ మిల్లును తెరిపించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నం చేశానని చెప్పారు. పేపర్ మిల్లును ఓపెన్ చేసేందుకు ముంబై, కలకత్తా వంటి అనేక ప్రాంతాల్లో పర్యటించి అనేక కంపెనీలను కలిసి జేకేతో మాట్లాడి పేపర్ మిల్లును తిరిగి ఓపెన్ చేయించానని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న మన పార్టీతో కలిసి నడిచేందుకు ముందుకు వచ్చిన నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అని కేటీఆర్ అన్నారు. తెలంగాణ సమాజం గురించి.. తెలంగాణ అభివృద్ధి గురించి భవిష్యత్తు తెలంగాణ గురించి ప్రవీణ్ కుమార్ గారి ఆలోచనలు నా ఆలోచనలు దాదాపు ఒకే రకంగా ఉన్నాయని తెలిపారు. అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ఇచ్చిన అనేక అవకాశాలను, పదవులను వదులుకొని బహుజన అభివృద్ధి కోసం మన పార్టీలో ఆయన చేరారని పేర్కొన్నారు. కేసీఆర్‌తోనే బహుజనుల అభివృద్ధి జరుగుతుందని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ నమ్మారని అన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సిర్పూర్ కాగజ్ నగర్ కార్యకర్తలు పనిచేసి అద్భుతమైన ఫలితాలను సాధించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాగజ్ నగర్ లో కమిట్మెంట్ ఉన్న నాయకులు చాలామంది ఉన్నారని తెలిపారు. కాగజ్ నగర్ నియోజకవర్గంలో ఉన్న ఏడు మండలాల్లో గులాబీ జెండా ఎగరాలని ధీమా వ్యక్తం చేశారు.




అమ్మవారు ఊరేగింపుకు స్వాగతం పలుకుతున్న మహిళా భక్తులు

# కనుల పండుగగా అమ్మవారి శిఖర కలశ ఊరేగింపు

కొత్తకోట, ఫిబ్రవరి 8(ప్రభాత ఉదయం) పట్టణంలో కొలువై ఉన్న శక్తి స్వరూపిణి కొలిచే వారికే కొంగు బంగారంగా వెలిసిన శ్రీ భవాని శంకర అమ్మవారి వేడుకల్లో భాగంగా తొలిఘట్టమైన శిఖర కలశాల శోభా యాత్ర అత్యంత వైభవంగా శనివారం ప్రారంభమైంది. అమ్మవారి కలశ ఊరేగింపు పట్టణంలో రాఘవేంద్ర స్వామి వారి ఆలయం నుండి పురవీధుల ఊరేగింపుగా ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కలశ ఊరేగింపు మధ్యాహ్నం రెండు గంటలకు ప్రధాన రహదారి ద్వారా అమ్మవారి ఆలయానికి అత్యంత వైభవంగా చేరుకుంది. శనివారం నుండి సోమవారం వరకు నూతన ధ్వజస్తంభ ఏర్పాటు కొరకు మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు ఉత్సాహాలు నిర్వహిస్తున్నారు. ఈ యాత్రలో దాదాపు 1000 మంది వరకు భక్తులు పాల్గొన్నారు. భక్తులు ప్రజలు మహిళలు జై భవాని జై జై భవాని మాత నామస్మరణతో పరిసరాలు మార్మోగి భక్తులు ప్రజలు కలిసికట్టుగా కాలి నడకన కలశ ఊరేగింపు ఎదట భజన బృందాలు, ఆటపాటలతో కోలాటాలతో బొడ్డెమ్మలతో మహిళలతో అత్యంత కొలహాలంగా సంప్రదాయ వాయిద్యాల నడుమ శోభయాత్ర ఆలయానికి చేరుకున్నది. కలశలు ఆలయానికి చేరుకోగానే అర్చకులు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. వచ్చిన భక్తులకు ప్రజలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులుకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేయడం జరిగింది అని ఆలయ ధర్మకర్త రాఘవేందర్ ప్రసాద్ తెలియజేశారు.



కొలువుదీరిన అమ్మవారు



## అవినీతిని సహించేది లేదన్న ఢిల్లీ ప్రజలు

### ఆప్ ఓటమికి అవినీతే కారణమన్న కిషన్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ప్రభాత ఉదయం):** అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతామని రాజకీయాల్లోకి వచ్చిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్.. చివరికి ఆయనే అవినీతికి చిరునామాగా మారిపోయారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. అవినీతిలో మునిగిన కారణంగానే ఢిల్లీ ప్రజలు తిరస్కరించి ఓడించారని అన్నారు. చివరకు లిక్కర్ స్కామ్‌లో కూడా తేలియాడారని అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతిలో కూరుకుపోతే ఏం జరుగుతుందో దిల్లీ ఫలితాలు ఉదాహరణ అని పేర్కొన్నారు. 'కేజ్రీవాల్, సిసోదియా లాంటి నేతలను దిల్లీ ప్రజలు ఓడించారు. కాంగ్రెస్ దీనస్థితి చూస్తే అందరికీ జాలి కలుగుతోంది. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌కు ఇది ఎన్నో ఓటమో లెక్కపెట్టాలి. దిల్లీలో వరుసగా 3 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ డకౌట్ అయ్యింది. అసలు గెలవాలనే ఆలోచన కాంగ్రెస్‌కు ఎప్పుడూ ఉండదు. మోదీని, భాజపాను ఓడించాలని మాత్రమే రాహుల్‌గాంధీ ఆలోచిస్తారు. రాజ్యాంగం చేతిలో పట్టుకుని తిరగటం కాదు.. రాజ్యాంగ విలువలు పాటించాలి. కేజ్రీవాల్ నాయకత్వంలోనే దిల్లీలో లిక్కర్ స్కామ్ జరిగిందని ప్రజలు నమ్మారు. లిక్కర్ స్కామ్‌పై దిల్లీ ప్రజలు తీర్పు ఇచ్చారు.. ఇక కోర్టు తీర్పు రావాల్సి ఉంది. ఎన్ని ఉచితాలు ఇస్తామన్నా కేజ్రీవాల్‌ను ప్రజలు నమ్మలేదు. జైలు నుంచే పరిపాలన చేసిన కేజ్రీవాల్ డ్రామాలను ప్రజలు తిప్పికొట్టారు. పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని దిల్లీలో ఇకపై అభివృద్ధి జరగనుంది' అని కిషన్‌రెడ్డి అన్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాకు భారీ విజయాన్ని కట్టబెట్టినందుకు అక్కడి ప్రజలకు ఎంపీ ఈటల రాజేందర్ అభినందనలు తెలిపారు. కేజ్రీవాల్ పాలనలో దిల్లీ ప్రజల జీవన ప్రమాణాలు ఏమాత్రం బాగుపడలేదన్నారు. లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్ ఇరుక్కుపోయి దిల్లీ ప్రజల పరువు తీశారన్నారు. కేజ్రీవాల్ విధానాలను దిల్లీ ప్రజలు తిరస్కరించారనే దానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీపైన దేశ ప్రజలకు నమ్మకం లేదన్నారు. మోదీ పాలన వల్లే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. రాబోయే కాలంలో తెలంగాణలో కాషాయ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం

**మొదటి పేజీ తరువాయి...**

సందేశమిచ్చారు. 'ఈ ఎన్నికల్లో ప్రజాతీర్పును మేము వినమ్రంగా అంగీకరిస్తున్నాం. ఈ సందర్భంగా అధికారంలోకి రానున్న బిజెపికి అభినందనలు తెలియజేస్తున్నాను. ఓటు వేసిన ప్రజలకు వారు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని నేను ఆశిస్తున్నాను. మేము అధికారంలో ఉన్న పదేళ్లలో ఆరోగ్యం, విద్య మౌలిక సదుపాయాల కల్పన రంగాల్లో ఎన్నో పనులు చేశాం. అయితే ఇప్పుడు నిర్మాణాత్మక ప్రతిపక్షంగానే కాకుండా ప్రజల్లోనే ఉంటూ వారికి సేవ చేస్తూనే ఉంటాం. మేము అధికారం కోసం రాజకీయాల్లోకి రాలేదు. ప్రజలకు సేవ చేసే మాధ్యమంగా భావించే రాజకీయాల్లోకి వచ్చాం' అని ఆయన పేర్కొన్నారు.

# 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీ పీఠాన్ని బీజేపీ గెలుచుకోవడం సంతోషకరం



హైదర్‌గూడలో మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు



ఉప్పర్‌పల్లిలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

బుద్వేల్, ఫిబ్రవరి8(ప్రభాత ఉదయం): ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడంతో రాజేంద్రనగర్ సర్కిల్ లో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచ కాల్చి మిఠాయిలు తినిపిం చుకున్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్ గూడ లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సులిగె వెంకటేశ్ ఆధ్వర్యంలో జరిగిన సంబరాలలలో స్థానిక కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్, బీజేపీ చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మోంద్ర కొమురయ్య, రాజేం ద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేశ్ యాదవ్ లు హాజరయ్యారు. 27 సంవత్సరాల తర్వాత డిల్లీ పీఠాన్ని బీజేపీ గెలుచుకోవడం సంతోషకరమన్నారు. రాబోయే రోజులలో భారత దేశం అంతా కాషాయమయం అవడం ఖాయమన్నారు. ఆంధ్రప్రదేశ్ లో జగన్ కు పట్టిన గతే తెలంగాణ లో రేవంత్ రెడ్డి కి పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాడెం సుధాకర్, జిల్లా అధికార ప్రతినిది రాచూరి రాజశేఖర్. నాయకులు జయానంద్ రెడ్డి. విజయ్ కుమార్, కిరణ్ చారి, ఎస్.వాసు, పి.వెంకట్ రెడ్డి , రావుల జగన్, వినోద్ జంగిడ్, అనురాధ. సరితారెడ్డి, గాయత్రి, విజయ, స్వామి తదితరులు పాల్గొన్నారు.



మైలార్‌దేవ్‌పల్లిలో మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

### ఉప్పర్ పల్లిలో

రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి బండారి బాలక్రిష్ణ ఆధ్వర్యంలో ఉప్పర్ పల్లి చౌరస్తాలో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యువమోర్చ రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి హాజరైనారు. డిల్లీ ప్రజలు ప్రధాని నరేంద్రమోడీ పాలనపై నమ్మకంతో బీజేపీని గెలిపించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు గోనె శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్.విఠల్, నాయకులు మల్లేశ్ చారి, ప్రకాశ్ నాయక్, పవన్, స్వప్నరెడ్డి, వెంకటేశ్, హర్షిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మైలార్దేవుపల్లిలో బీజేపీ సంబరాలు

ఢిల్లీలో బీజేపీ గెలవడం తో రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్దేవుపల్లిలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు మిఠాయిలు పంచుకుని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి రవి, సంతుగౌడ్, తలారి చిన్న, నవారు మ రళీధర్ రెడ్డి , వి.లక్ష్మీ, పాండు యాదవ్, బొమ్మరాజు నర్సింహ్మ . భూపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్

## ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడం సంతోషకరం

### పొన్నమోని మల్లేశ్ యాదవ్

బుద్వేల్, ఫిబ్రవరి 8 (ప్రభాత ఉదయం): ఢిల్లీ ఓటర్లు విజ్ఞతతో ఓటు వేసి భారతీయ జనతాపార్టీని గెలిపించి నందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ పొన్నమోని మల్లేశ్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. డిల్లీ లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయనుండటం సంతోషకరమన్నారు. దేశ ప్రజలందరికి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పై విశ్వాసం పెరిగిందన్నారు. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రా లలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఢిల్లీ ప్రజలు బీజేపీకి పట్టం కట్టారన్నారు. రాబోయే రోజులలో తెలంగాణ రాష్ట్రంలో కూడా బీజేపీ విజయం సాదిస్తుందన్నారు.



## నేడు గగన్ పహాడ్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 8() గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో ఆదివారం వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరు రవీందర్ తెలిపారు. త్రిశాల్ మెటల్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 10:00 నుండి ఒంటిగంట వరకు సర్వీసింగ్ గల్లి ప్రాంతం, కాటేదాన్ విద్యుత్తు సబ్స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు రవి ఫుడ్ పారిశ్రామిక ప్రాంతం, రామ్ చరణ్ ఆయిల్ మిల్ ప్రాంతం, 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు టీఎన్జీవోస్ కాలనీ, అమ్మ గార్డెన్, మార్కెట్ ప్రాంతం, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మెట్రో మాల్ విద్యుత్ ఫీడర్ ప్రాంతం లో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ స్థిరపరా నిలిపి వేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు .విద్యుత్తు వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.



మధుబన్ కాలనీలో హనుమాన్ దేవాలయం నిర్మాణం పనులను పరిశీలించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## హనుమాన్ దేవాలయం నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయి

బుద్వేల్, ఫిబ్రవరి8(ప్రభాత ఉదయం) : మధుబన్ కాలనీ హనుమాన్ దేవాలయంలో నూతనం గా నిర్మిస్తున్న దేవాలయ పనులను మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి శనివారం స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. దేవాలయ కమిటీ సభ్యుల కోరిక మేరకు దేవాలయ నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. దైవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులకు దేవుని ఆశీర్వాదాలు ఉంటాయన్నారు. భక్తి మార్గం మంచిదన్నారు. అది ప్రజలను సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. ఆధ్యాత్మిక జీవితంతో మానసిక ప్రశాంతత ఉంటుం దని, అందుకు దేవాలయాలు నిలయంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, ఎల్ వి రెడ్డి. తలారి చిన్న, ఎన్.శంకర్ రెడ్డి, , గోవింద్ రాజు, వినయ్, వెంకటేశ్, ఉత్తమ్, రాజ వర్ధన్ రెడ్డి, కిశోర్, శివాజీ, వలభ, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గద్వాలలో లాడ్జీల్లో పోలీసుల అకస్మిక తనిఖీలు



లాడ్జింగ్ లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసులు..



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులు

### డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టిన పోలీసులు 12 వాహనాలు, 15 మందిపై కేసు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి8(ప్రభాత ఉదయం)గద్వాల డీఎస్పీ మొగులయ్య ఆధ్వర్యంలో గద్వాల పట్టణంలోని పలు లాడ్జీల్లో పోలీసులు శనివారం రాత్రి అకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జీల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గద్వాల డీఎస్పీ మాట్లాడుతూ... లాడ్జీల్లో బస చేసే యాత్రికుల వద్ద సరైన ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని, అందరి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. చట్ట విరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వవద్దన్నారు. అనుమానితుల వివరాలను వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్....**

గద్వాల పట్టణ పరిధిలో గల బార్ అండ్ రెస్టారెంట్, వైన్ షాపులలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనంతరం పలు చోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను ఆపి వారికి బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా,ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా,అనుమతి పత్రాలు లైసెన్స్ లేకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గద్వాల డీఎస్పీ హెచ్చరించారు. మొత్తం ఈ 15మంది పై డ్రంక్ డ్రైవ్ కేసులు నమోదు కాగ 12 వాహనాలు సీజ్ చేశారు.ఈ తనిఖీల్లో గద్వాల సీఐ టి.శ్రీను, వివిధ పోలీస్ స్టేషన్‌ల ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కయ్యూమ్ నగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న అత్తాపూర్ కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్

## ఖయ్యూంనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బుద్వేల్, ఫిబ్రవరి 8 (ప్రభాత ఉదయం): అత్తాపూర్ డివిజన్ ఖయ్యూంనగర్ లో రూ.20లక్షలతో వేయనున్న సీసీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాణ్యతగా పనులు చేసేలా అధికారులు పర్యవేక్షిం చాలన్నారు. అత్తాపూర్ డివిజన్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, కొన్ని చోట్ల కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు ఆలస్యం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సులిగె వెంకటేశ్, వెంకటరెడ్డి, విజయ్, స్వామీ, ఎం.శ్రీనివాస్ తో పాటు బస్తీ ప్రజలు పాల్గొన్నారు.



ఢిల్లీలో ఘన విజయం సాధించిన సందర్భంగా మిఠాయిలు పంచి పెట్టుకుంటున్న బిజెపి నాయకులు

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ చారిత్రాత్మక విజయం

### డబుల్ ఇంజన్ సర్కార్ తో రాష్ట్రాలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయి

### బిజెపి రాష్ట్ర నాయకులు బుక్క వేణుగోపాల్

శంషాబాద్, ఫిబ్రవరి 8( ప్రభాత ఉదయం) ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా ఈరోజు వెలువడిన ఫలితాలలో ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ కోటలు బద్దలుకొట్టి ఘన విజయం సాధించిన శుభ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల పరిధిలోని నర్కుడ, చౌద్దరిగూడ గ్రామలలో స్థానిక నాయకులతో కలిసి బాణాసంచా పేల్చి మిఠాయిలు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్ పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి నానావల్ల కుమార్ యాదవ్ , నర్కుడ మాజీ సర్పంచ్ సునిగంటి సిద్దులు ,శంషాబాద్ మండల ఉపాధ్యక్షులు బూరుకుంట సంజీవ ,బిజెపి నాయకులు ఎలాగని నగేష్ గౌడ్, మామిళ్ళ మల్లేష్, నీరటి మల్లేష్, కనకమామిడి కిట్టు,వెంకటేష్, వినోద్ కుమార్, వీరేష్, బక్క అర్జున్, సాయి కిరణ్,నడ్డిగఢ మోహన్,బక్క రమేష్,లింగం జంగయ్య,నాగమల్లి శేఖర్,శ్రీకాంత్ గౌడ్ మెడిబాయ్ శ్రీనివాస్,కుమారి భాస్కర్,మన్నే ప్రవీణ్,కిరణ్ గౌడ్,మహేష్ గౌడ్, ఎలాగల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న వనపర్తి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గుంద్రాతి వామన్ గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్

## ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం

### వనపర్తి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్

కొత్తకోట, ఫిబ్రవరి8(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో పూర్తిగా వైపల్యం చెందిందని వనపర్తి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గుంద్రాతి వామన్ గౌడ్ ఆరోపించారు. శనివారం కొత్తకోట మండల కేంద్రంలో మండల మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్ తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వామను గౌడ్ మాట్లాడుతూ...త%శ్రీ% కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఏవైతే 420 హామీలు ఇచ్చారో ఏ ఒక్క హామీ కూడా పూర్తి చేయకుండా తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడ కూడా ప్రచారం చేసి 6 గ్యారంటీలు ఢిల్లీ ప్రజలను నమ్మించేందుకు వెళ్లాడు. కానీ కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ రాకుండా మూడవ స్థానానికి పరిమితం చేశారన్నారు. ఇది చూసిన తెలంగాణ ప్రజలు మోసపోయి గోసపడుతున్నామని ఆవేదన చెందుతున్నారు .ఇలాంటి దొంగ హామీలు ఇచ్చి తెలంగాణ రాష్ట్ర దేవుళ్ళపై ఒట్టు పెట్టుకొని మాట తప్పిన ముఖ్యమంత్రికి ఆ పార్టీకి త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఢిల్లీలో ఇచ్చిన తీర్పే తెలంగాణలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వబోతున్నారు. కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించడానికి ప్రజలు కంకణం కట్టుకున్నారన్నారు.



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయోత్సవం సందర్భంగా సంబరాలు జరుపుకుంటున్న కొత్తకోట బిజెపి నాయకులు

## బీజేపీ విజయంపై కొత్తకోటలో సంబరాలు

కొత్తకోట, ఫిబ్రవరి 8(ప్రభాత ఉదయం) ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయభేరి మ్రోగించడంతో కొత్తకోటలో బీజేపీ నాయకులు కార్యకర్తలు శనివారం సాయంత్రం బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బీజేపీ మాజీ కౌన్సిలర్ కొమ్ము భారత్ భూషణ్ మాట్లాడుతూ అరవింద్ క్రేజీవాల్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని,లిక్కర్ స్కామ్ కేసులో జైలుకు వెళ్లిన ముగ్గురిని ఢిల్లీ ప్రజలు ఓడించారని ఢిల్లీ ప్రజలు నరేంద్ర మోదీ పాలనపై నమ్మకం ఉంచి బీజేపీని గెలిపించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


హిజ్రాలకు సూచనలు చేస్తున్న పోలీసులు

## హిజ్రాలు బలవంతం వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

### గద్వాల సీఐ టి.శ్రీను

### హిజ్రాలకు వార్నింగ్ ఇచ్చిన పోలీసులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి8(ప్రభాత ఉదయం)హిజ్రాలు బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని గద్వాల సీఐ టి.శ్రీను హెచ్చరించారు. గద్వాలలో జరిగే శుభకార్యాలు, గృహప్రవేశాలు వేడుకలు, హోటల్లు, షాపింగ్ మాల్స్, షోరూమ్ ప్రారంభోత్సవాలలో హిజ్రాలు వేలకు వేలు డిమాండ్ చేస్తూ బలవంతపు వసూళ్ల చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు గద్వాల సీఐ టి.శ్రీను ఆద్వర్యంలో పోలీసులు హిజ్రాల బలవంతపు వసూళ్ల మీద, వేధింపుల మీద దృష్టిపెట్టారు. శనివారం గద్వాల సీఐ కార్యాలయంలో... హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. శుభకార్యాల్లో వారి ఇష్టంతో ఎంతోఅంత ఇస్తే తీసుకోవాలి కానీ.. వారి ఇంట్లో పిల్లల్ని, బంధువులను భయభ్రాంతులకు గురి చేసి వెకిలి చేష్టలు చేసినా.. పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినా కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని సీరియస్ గా వార్నింగ్ ఇచ్చారు. రోడ్డు మీద వాహనదారుల వద్ద బలవంతపు వసూళ్లకు పాల్పడకూడదన్నారు. హిజ్రాలు సమాజంలో గౌరవ పదంగా బ్రతకాలన్నారు. బతకడానికి ఎలాంటి అవకాశాలున్నాయో వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.


దొంగతనంలో స్వాధీనం చేసుకున్న సెల్ఫోన్లను ఫిర్యాదుదారులకు అందజేస్తున్న పోలీసులు

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అప్పగింత

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి8(ప్రభాత ఉదయం)గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు సెల్‌ఫోన్‌లు పోగొట్టుకోగ బాధితులు గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ యాప్‌ను ఉపయోగించి సెల్‌ఫోన్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. 13 సెల్‌ఫోన్‌లను రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ శనివారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


బోయలగూడెం గ్రామంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ చేస్తున్న డి.ఎస్.పి మొగులయ్య

## ఎస్సీ అట్రాసిటీ కేసును విచారించిన డీఎస్పీ మొగులయ్య

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి8(ప్రభాత ఉదయం)ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును విచారించేందుకు శనివారం గట్టు మండలంలోని చాగదోణ, బోయలగూడెం గ్రామాలను గద్వాల డీఎస్పీ మొగులయ్య సందర్శించారు. కులం పేరుతో దూషించారంటూ బాధితులు గట్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఫిర్యాదు మేరకు గద్వాల డీఎస్పీ మొగులయ్య బాధితులను, గ్రామస్తులను విచారించి, వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన వెంట గట్టు ఎస్ఐ కేటి మల్లేష్, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



## పాగుంటా వెంకన్న సన్నిధిలో భక్తుల సందడి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి8(ప్రభాత ఉదయం)కేటిదొడ్డి మండలం వెంకటాపురం వెలసిన పాగుంటా శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తుల రద్దీతో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సందర్భంగా భక్తులు స్వామి వారికి దాసంగాలు సమర్పించి, తమ మొక్కులు చెల్లించుకున్నారు.

# ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

### ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర, ఫిబ్రవరి 8(ప్రభాత ఉదయం) ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటుందని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని కౌకుంట్ల మండల కేంద్రంలో 10వ తరగతి విద్యార్థులకు జిఎంఆర్ సేవా సమితి ద్వారా ప్రత్యేకంగా తయారు చేయించిన స్టడీ మెటీరియల్ పంపిణీ, కొజెంట్ కంపెనీ వారి సహకారంతో కాలినడకన పాఠశాలకు వచ్చే (పుట్టపల్లి, ఇస్రంపల్లి, రాజోలి గ్రామాల) విద్యార్థులకు సైకిల్ లను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని, పాఠశాలలో మౌలిక వసతులను పట్టించుకోలేదని, పదేళ్ల పాలనలో టీచర్ల నియామకాలను చేపట్టలేదని, విద్యాశాఖకు నిధులు కేటాయించలేదని బిఆర్ఎస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యాశాఖకు అధిక నిధులు కేటాయించడంతో పాటు 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశామని, 15 ఏళ్ల తర్వాత సుమారు 19,000 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, స్కూలు ప్రారంభమైన మొదటి వారంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు పంపిణీ చేశామని, పదేళ్లలో ఎన్నడు లేని విధంగా విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచామని గుర్తు చేశారు. దేవరకద్ర నియోజకవర్గం లో పదేళ్లు అధికారంలో ఉండి, కనీసం డిగ్రీ కాలేజ్ ను ఏర్పాటు చేయలేకపోయారని, కానీ తాము అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కాలేజ్ మంజూరు ఏర్పాటు చేశామని, చిన్న చింతకుంట మండల కేంద్రంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేశామని తెలియజేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఏకాగ్రతతో చదువుకోవాలని, పదవతరగతి లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు, ప్రభుత్వ పాఠశాలల్లోనే క్వాలిఫైడ్ టీచర్స్ ఉంటారని, విద్యార్థులకు మంచి విద్యాబోధన అందుతుందని తెలిపారు, చదువుకుంటే ప్రపంచాన్ని చేయించవచ్చని అన్నారు, తాను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని ఈ స్థాయికి వచ్చామని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు, విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా, పాఠ్యపుస్తకాల నుండి క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ క్లాసులకు అనుసంధానమయ్యేలా నిపుణులైన అధ్యాపకులతో తన సొంత నిధులతో స్టడీ మెటీరియల్ తయారు చేయించడం జరిగిందని, ఈ స్టడీ మెటీరియల్ ను మండల విద్యార్థులతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని 10 తరగతి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు.


విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్


కేటి దొడ్డిలో స్వీట్లు పంచుకుంటున్న బిజెపి నాయకులు

## కేటీదొడ్డిలో బీజేపీ విజయోత్సవ సంబరాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి8(ప్రభాత ఉదయం)పదేండ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఢిల్లీ ప్రజలు బీజేపీని ఆదరించి పట్టం కట్టారని కేటిదొడ్డి మండలం బీజేపీ నాయకులు అన్నారు. శనివారం వెలువడిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో దాదాపు 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ కోటపై కాషాయం పార్టీ జెండా ఎగరవేసిన నేపథ్యంలో కేటిదొడ్డి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు విజయోత్సవ సంబరాలు నిర్వహించి, టపాసులు పేల్చారు. ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తలు, స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ ఢిల్లీలో ప్రజలు అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపి, సమర్థ పాలన కోసం బీజేపీని గెలిపించారన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలోనూ అవినీతి, అసమర్థ పాలనతో ప్రజలను వేధిస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు సాగనంపడం ఖాయమని అన్నారు. తెలంగాణలోనూ బీజేపీ జెండా ఎగరడం తథ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు అనిమిరెడ్డి, శ్రీపాదరెడ్డి ,భీమిరెడ్డి ,రాములు ,సూర్యకాంత రెడ్డి, కృష్ణ కాంత్, మునెప్ప,వీరేశ్ విజయ్ గౌడ్ వాచనాయక్,ఈరన్న, శంకర్ నాయక్ ,కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

### జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీ నారాయణ




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 8(ప్రభాత ఉదయం) గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలపై అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ (రెవెన్యూ), నర్సింగరావు(ఎల్ బి), కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ లకు తెలిపారు. శనివారం ఐ డి ఓ సి లోని కాన్ఫరెన్స్ హాల్ నందు సంఘాల బలోపేతానికి సీఆర్పీ వ్యూహం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సంఘాల శక్తిని పెంచడం, సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించడం, స్థానిక సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంలో సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమం ద్వారా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు సంబంధిత గ్రామాలకు వెళ్లి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. గత విజయాలను పంచుకోవడం, గ్రామాల్లో తలెత్తే చిన్న సమస్యలను తక్షణమే పరిష్కరించడంలో సహాయం చేయాలన్నారు. సంఘాలలో సభ్యత్వాన్ని పెంచడంతో పాటు సభ్యుల మధ్య ఐక్యతను పెంపొందించడం వలన గ్రామాల్లో సామాజిక చైతన్యం పెరుగుతుందని అన్నారు. సంఘాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు , ఆర్థిక వనరులు పెరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడి నరసింహులు, మహిళా సంఘాల అధ్యక్షురాలు సంగీత, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.


మహిళా సమ్మాన్ సేవింగ్ పథకం కరపత్రాన్ని విడుదల చేస్తున్న పోస్టల్ పర్యవేక్షకులు సైదా నాయక్

## మహిళలకు గొప్ప వరం- మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్

### రెండు సంవత్సరాలకు గాను ఆకర్షణీయమైన వడ్డీ రేటు

### గద్వాల్ తపాలా శాఖ సహాయ పర్యవేక్షకులు ఎల్ సైదా నాయక్

గద్వాల్ జిల్లా ప్రతినిధి , ఫిబ్రవరి8(ప్రభాత ఉదయం) పోస్టల్ మహిళా సమ్మాన్ సేవింగ్ పథకం మహిళలకు వరం లాంటిదని పోస్టల్ సహాయ పర్యవేక్షకులు సైదా నాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికేట్ (యం.యస్.యస్.సి) ఖాతాకు సంబంధించిన కర పత్రాలు , గోడ పత్రికలను మహిళా ఉద్యోగి అయిన కె.కళావతి పోస్ట్మాస్టర్ గద్వాల్ హెచ్.ఓ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ సహాయ పర్యవేక్షకులు సైదా నాయక్ మాట్లాడుతూ...
యం.యస్.యస్.సి ఖాతా 2023 సంవత్సరపు కేంద్ర బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త పొదుపు పథకం ప్రత్యేకంగా మహిళాల కోసం ప్రవేశపెట్టబడిందన్నారు. ఈ పథకానికి కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్టంగా ,రూ.2,00,000 వరకు పెట్టుబడి చేసుకోవచ్చన్నారు. ఈ పథకానికి రెండు సంవత్సరాల పెట్టుబడి గాను ప్రస్తుత ఆకర్షణమైన వడ్డీ రేటు రూ.7.5 శాతం గా ఉందన్నారు. ఈ ఖాతా మహిళలకు రక్షణ కల్పించడం కొరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టందని, కావున మహిళలు మార్చ్ 31లోపల పోస్టాఫీస్ లో ఖాతాలు తెరివలచి తపాలా శాఖ మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికేట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ ప్రధాన తపాలా కార్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608